## క్లుప్తంగా

### పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా భాస్కర్



**సిరిసిల్లటౌన్:** పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా ఆడెపు భాస్కర్ ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఆంకాలపు రవి, ఉపాధ్యక్షుడిగా దూడం రమేశ్, కోశాధికారిగా బండారి అశోక్‌ను ఎన్నుకున్నారు. ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల అధికారి, పోపా ఉపాధ్యక్షుడు మామిడాల భూపతి అందించారు.

### నులిపురుగులను నివారించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

**కోనరావుపేట(వేములవాడ):** నులిపురుగులను పూర్తిస్థాయిలో నివారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత పేర్కొన్నారు. మండల పరిషత్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 20న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్ల వారికి మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. ఇతరత్ర అనారోగ్య సమస్యలు ఉంటే మాత్రలు వేసుకోవద్దని తెలిపారు. మండల వైద్యాధికారి వేణుమాధవ్, సీహెచ్‌వో బాలచంద్రం, సూపర్‌వైజర్లు శ్రీదేవి, రషీద్, హెల్త్ అసిస్టెంట్లు సవాయిలాల్, అశోక్ పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

**తంగళ్లపల్లి(సిరిసిల్ల):** ఇల్లంతకుంట మండలం రేపాకకు చెందిన దళిత యువతిని పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు నర్సక్కపేటకు చెందిన కొత్త శ్రీనివాస్‌రెడ్డిపై గురువారం కేసు నమోదైంది. శుక్రవారం సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఇల్లంతకుంట చేరుకుని ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ చేపట్టారు. బాధితురాలు, సాక్షుల నుంచి వివరాలు సేకరించారు.

### దరఖాస్తులు ఆహ్వానం

**సిరిసిల్లకల్చరల్:** ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్‌లో నిర్వహిస్తున్న అంధుల పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.నర్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి ఏడోతరగతి వరకు ఇంగ్లిష్ మీడియం, 8 నుంచి పదోతరగతి వరకు తెలుగు మీడియంలో ప్రవేశాలకు అవకాశముందన్నారు.

### ఒకటో తరగతి ప్రవేశాలకు ఎంపిక నేడు

**సిరిసిల్లకల్చరల్:** బెస్ట్ అవేలబుల్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం శనివారం డ్రా నిర్వహించనున్నట్లు ఎస్సీడీవో అజ్మీర వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ రెసిడెన్షియల్ విధానంలో 46 సీట్లను కేటాయించిన నేపథ్యంలో దరఖాస్తుదారులను లాటరీ విధానంలో ఎంపిక చేయనున్నట్లు వివరించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా తీయనున్నామన్నారు. ఉదయం 11 గంటలకు హాజరవ్వాలని సూచించారు.


### బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఏనుగు మనోహర్‌రెడ్డి

**వేములవాడఅర్బన్:** అగ్రహారం గ్రామానికి చెందిన జవ్వాజి ఎల్లయ్య రోడ్డు ప్రమాదంలో మరణించగా.. సంకెపల్లి గ్రామానికి చెందిన బండారి అంజయ్య ఇటీవల మృతిచెందాడు. వారి కుటుంబాలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి శుక్రవారం పరమర్శించారు. మాజీ సర్పంచ్ బుర్ర మురళి, బుచ్చయ్య, ముత్త మహేశ్, నాగుల రాము, జింక శ్రీధర్ తదితరులున్నారు.

### బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

**ముస్తాబాద్:** కుల గణనకు అనుకూలంగా బలహీనవర్గాలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ యువజన సంఘం జిల్లా ఇన్‌చార్జి తొటకూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ముస్తాబాద్‌లో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. త్వరలోనే జిల్లా నలుమూలల యువజన సంఘం సమావేశాలను నిర్వహిస్తామన్నారు. బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శి ఈడుగురాళ్ల సురేశ్, పాకాల శ్రీకాంత్, చిగురు వెంకన్న, శ్రావణ్, నాగరాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల ఆక్రమణకు యత్నం

- చోద్యం చూస్తున్న అటవీ శాఖ అధికారులు
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



కోనరావుపేట శివారులో నరికేసిన చెట్లు

**కోనరావుపేట:** అటవీ ప్రాంతానికి రంపపు కోత పెడుతున్నారు. ఎకరాల కొద్ది అటవీ భూమిని మిషనరీలతో కోత పెడుతున్నా అధికారులు స్పందించక పోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రంలోని అటవీ ప్రాంతంలో అక్రమార్కులు అటవీ సంపదను కొల్లగొడుతూ భూములను ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. కోనరావుపేట అటవీ ప్రాంతంలోని ఎగ్లాస్‌పూర్ ఎల్లమ్మ ఆలయ ఆవరణలోని అటవీ ప్రాంతంలో మిషన్ల ద్వారా చెటట్లు నరికివేస్తూ అటవీ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారంరోజులుగా మిషన్ల ద్వారా పచ్చని చెట్లను నరికి వేస్తూ మోడులుగా మారుస్తున్నారు. ఎగ్లాస్‌పూర్‌కు చెందిన చక్రాల వేణుపై ఇప్పటికే అటవీ అధికారులు కేసు నమోదు చేశారు. అయినా మిషన్ల ద్వారా చెట్లను నరుకుతున్నారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు మిషన్ల ద్వారా ఎవరు నరికేశారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. చెట్లను నరికివేస్తూ అటవీ భూములను ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిపై అటవీ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

**చెట్లను నరికేస్తే చర్యలు**

చెట్లను నరికేస్తే చర్యలు తీసుకుంటామని ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. అటవీ భూముల ఆక్రమణపై వివరణ కోరగా.. కోనరావుపేట అటవీ ప్రాంతంలో మిషన్ల ద్వారా చెట్లను నరికేస్తున్నారని, ఇప్పటికే చక్రాల వేణుపై కేసు నమోదు చేశామన్నారు. మిషన్ల ద్వారా చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలించామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సత్తయ్య

**ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 24, 25, 26లో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ఇంటిగ్రేటెడ్ మార్కెట్(డేలీ వేజ్) కూరగాయాల మార్కెట్‌కు కేటాయించాలని గ్రామస్తులు కోరారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ప్రత్యేకాధికారి సత్తయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. రేషన్ దుకాణాల్లో బియ్యం తక్కువ తూకం వేస్తున్నారని, నిత్యావసర సరుకుల పంపిణీపై అధికారుల పర్యవేక్షణ లేదన్నారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సెస్ అధికారులు గ్రామసభకు ఎందుకు రావడం లేదన్నారు. నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని ప్రత్యేకాధికారి అన్నారు. మాజీ వార్డు సభ్యులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజమైన బాల సాహిత్యకారుడు అశోక్



**సిరిసిల్లకల్చరల్:** నాలుగు దశాబ్దాలపాటు సృజనాత్మక సాహిత్య రంగంలో కృషిచేసిన గరిపెల్లి అశోక్ నిజమైన బాల సాహిత్యకారుడు అని పలువురు వక్తలు కొనియాడారు. హైదరాబాద్‌కు చెందిన అమరవాది ఫౌండేషన్ డాక్టర్ ఏసీఎంఎల్ ప్రసాద్ హైమావతి తొలి బాలసాహిత్య పురస్కారాన్ని అశోక్ స్వీకరించారు. నేషనల్ బుక్ ట్రస్టు సదరన్ రీజినల్ అధికారి డాక్టర్ పత్తిపాక మోహన్, మణికొండ వేదకుమార్, తెలంగాణ సాహిత్య అకాడమీ కన్వీనర్ డాక్టర్ మృణాళిని, కార్యదర్శి డాక్టర్ బాలాచారిఫౌండేషన్ మాట్లాడారు. ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ మాలవ్య, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ హారిక చెరుకుపల్లి, చింతకింది కామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాతకు అవార్డు



**సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఏకంగా 48 సార్లు రక్తదానం చేసి ఎల్లారెడ్డిపేటకు చెందిన వంగ గిరిధర్ రెడ్డి ఉత్తమ సేవా పురస్కారంతో సత్కరించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్‌మిశ్రా, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టియానా, ఎంపీ సురేష్ చెట్కార్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

**ఎల్లారెడ్డిపేట:** నారాయణపూర్‌లోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయ వార్షిక వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి చిత్రపటంతో గ్రామ పురవీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. స్వామివారికి అభిషేకం, రెండు గంటలపాటు వేద పండితులు శివవేదశాస్త్రి శైలేంద్ర, వీరేంద్ర శివశాస్త్రి హోమం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్మాణ కర్త కుటుంబ సభ్యులు ఏరే నర్సయ్య, మాజీ సర్పంచులు దొమ్మాటి నర్సయ్య, నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అపెరా సుల్తాన, నాయకులు గౌస్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

### ఘనంగా ఉత్తర నక్షత్ర పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

**ముస్తాబాద్:** ముస్తాబాద్‌లోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారి ఉత్తర నక్షత్ర పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజుగురుస్వామి ఆధ్వర్యంలో ఉదయం గణపతి హోమం జరిపారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం మెట్ల పూజ ఘనంగా నిర్వహించారు. విజయ్‌రెడ్డి, తలారి నర్సింలు, మహేశ్‌రెడ్డి, చారి, ఎల్లం, నందు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన



బొప్పాపూర్‌లో విద్యార్థులకు అక్షరాభ్యాసం



గంభీరావుపేట: సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో సీడీపీవో

**ఎల్లారెడ్డిపేట:** మెరుగైన వసతులతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నట్లు ఎంపీడీవో సత్తయ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి గ్రామాల్లో ర్యాలీలు తీశారు. రాచర్లబొప్పాపూర్‌తోపాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎన్నారై రాధారపు సత్యం వితరణ చేసి విద్యాసామగ్రిని అందజేశారు. ఎంపీపీ పిల్లి రేణుక, ఎంఈవో రఘుపతి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు కుబేరస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సిరిసిల్లటౌన్:** కొత్త విద్యాసంవత్సరం ఆరంభం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బడులు, అంగన్‌వాడీ కేంద్రాలు విద్యార్థుల అడ్మిషన్లతో కళకళలాడాయి. స్థానిక రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో 20మంది చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు విష్ణు, రమేశ్, శైలజ, శ్రీవాణి, అంగన్‌వాడీ టీచర్లు మమత, మంజుల, తల్లిదండ్రులు పాల్గొన్నారు. బీవైనగర్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన బడిబాటలో హెచ్‌ఎం ఆంజనేయులు చేతుల మీదుగా 10మంది విద్యార్థులకు సామూహిక అక్షరభ్యాసం జరిగింది. తారకరామానగర్, నెహ్రూనగర్ ప్రైమరీ పాఠశాలల్లో ఎంఈవో దూస రఘుపతి చేతుల మీదుగా సామూహిక అక్షరభ్యాసం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించారు.

**గంభీరావుపేట:** అంగన్‌వాడీ కేంద్రాల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు, చిన్నారులకు ఆటపాటలతోపాటు ప్రీప్రైమరీ విద్యనందిస్తున్నట్లు సిరిసిల్ల సీడీపీవో అలేఖ్య పటేల్ అన్నారు. అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేజీటుపీజీ విద్యాసంస్థల్లో భాగమైన గంభీరావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో రాజశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిపేట, రాజేశ్వర్‌రావునగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. రాజేశ్వర్‌రావునగర్‌కు చెందిన పిట్ల వెంకటేశం అనే వ్యక్తి విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు.

**వేములవాడరూరల్:** నాగాయపల్లి, పోచెట్టిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీబాయి, సరిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ముస్తాబాద్:** మద్దికుంట ప్రాథమిక పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**చందుర్తి:** అంగన్‌వాడీ చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించడమే అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మల్యాల అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరభాస్యం చేపట్టారు. లత, వనజ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

**కోనరావుపేట:** మరిమడ్ల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగలక్ష్మి మాట్లాడారు. ఎంపీటీసీ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు బి.లక్ష్మి, ఎస్.లక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**బోయినపల్లి:** స్తంభంపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**వీర్నపల్లి:** మండల కేంద్రంలోని మొదటి అంగన్వాడీ కేంద్రం లో సూపర్వైజర్ రేణుక ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్ హాజరయ్యారు.

# జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక



గంభీరావుపేట: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**గంభీరావుపేట:** జాతీయ ఉపకార వేతనాల(ఎన్ఎంఎంఎస్)కు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 9మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కొత్తపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్‌కు చెందిన గీతిక, త్రిషాల, అక్షయ, నూతనశ్రీ, గోరింటాలకు చెందిన మహ్మద్ రియాన్, మధుహాసిని, దమ్మన్నపేటకు చెందిన శ్రీచైత్ర, లింగన్నపేటకు చెందిన ప్రణీత, శ్రీవాణి ఎంపికయ్యారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

**చందుర్తి:** మల్యాల గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. మల్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న యెల్ల చరణ్, గౌర్రె దీక్ష రాత పరీక్ష ద్వారా ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శరత్‌చంద్ర తెలిపారు.

### వృద్ధుల సంక్షేమంపై దృష్టి సారించాలి

**ఎల్లారెడ్డిపేట:** వృద్ధుల సంక్షేమంపై నిర్వాహకులు దృష్టి సారించాలని, వారికి అన్ని వసతులు అందుబాటులో ఉంచాలని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. మండల కేంద్రంలోని డే కేర్ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. వారితో యోగక్షేమాలపై కొద్దిసేపు మాట్లాడారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వృద్ధుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని కేంద్రం ఇన్‌చార్జి మమతకు సూచించారు. వృద్ధులతో కలిసి భోజనం చేశారు. నాయకులు బాల్‌రాజ్, సంతోష్, వెంకటేశ్‌గౌడ్, ప్రకృతి ఎన్‌జీవో ఆర్గనైజర్ చార్లెస్ తదితరులున్నారు.

### దారి దోపిడీ ఘటనపై పోలీసుల విచారణ

**తంగళ్లపల్లి(సిరిసిల్ల):** తంగళ్లపల్లి–ఇల్లంతకుంట మండలాల శివారు లక్ష్మీపూర్ వద్ద ఇల్లంతకుంట మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ను ముగ్గురు దుండగులు దారి దోపిడీ చేశారని తెలుపుతూ శుక్రవారం లక్ష్మీపూర్ శివారులో దారి దోపిడీ పేరుతో సాక్షి కథనం ప్రచురించింది. తంగళ్లపల్లి పోలీసులు విచారణ ప్రారంభించారు. బాధితుడు శ్రీనివాస్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

సాక్షి స్పందన

# యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి



బోయినపల్లిలో సమావేశం

**బోయినపల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థులకు సంబంధించిన అన్ని వివరాలను యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఎంఈవో శ్రీనివాసదీక్షితులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం యూడైస్ ప్లస్‌లో ప్రమోషన్ ఆక్టివిటీస్‌పై ప్రధానోపాధ్యాయులతో శిక్షణ సమావేశం నిర్వహించారు. 2024–2025 విద్యాసంవత్సరంలో పాఠశాలలో చదివిన విద్యార్థుల వార్షిక ఫలితాలు, వేరే పాఠశాలకు వెళ్తున్నారా, విద్యార్థి హాజరు శాతం తదితర వివరాలు యూడైస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కోరారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భూమయ్య, బొల్లం శ్రీనివాస్, ఉషారాణి, సీసీవో శ్రీపతి చంద్రమౌళి, కోఆర్డినేటర్ ఎస్.రజిత తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన ఉపాధిహామీ గ్రామసభలు

**వీర్నపల్లి:** మండలంలో శనివారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్తయ్య తెలిపారు. ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు మండలంలో జరిగిన పనులు తనిఖీ చేసేందుకు బృందం గ్రామసభలు నిర్వహించగా.. సభలు శుక్రవారం ముగిశాయి. గ్రామసభల నివేదికలను శనివారం నిర్వహించే ప్రజావేదికలో చర్చిస్తామన్నారు.

### రక్తదానంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న ఫౌండేషన్ యువకులు

**వేములవాడ:** రక్తదానం చేయడమంటే ప్రాణాలు కాపాడినట్లేనంటూ వేములవాడకు చెందిన యువ ఫౌండేషన్ యువకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం జూన్ 14 సందర్భంగా వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో ప్రముఖ నేత్ర వైద్యులు రమణారావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. రమణారావు, యువ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. రక్తదానానికి దాతలు ఉత్సాహంగా, నిర్భయంగా, ఎలాంటి అపోహలకు లోను కాకుండా స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మార్నింగ్ క్రికెట్ క్లబ్ సభ్యులు, యువ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

**రక్తదానం చేసిన ఎంపీటీసీ సభ్యుడు**

**ఎల్లారెడ్డిపేట:** నారాయణపూర్‌కు చెందిన ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు మజీద్ శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదానం చేశాడు. సిరిసిల్ల సివిల్ ఆస్పత్రిలో రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ.. రక్తదానం చేయడం నిర్జీవమవుతున్న మనిషికి జీవాన్ని.. జీవితాన్ని దానం చేసినట్లేనని తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అభినందించారు.

### 'బండి'ని కలిసిన నాయకులు



**వేములవాడ/వేములవాడరూరల్:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌ని వేములవాడ బీజేపీ నాయకులు రేగుల మల్లికార్జున్, బండ మల్లేశం, ఎర్ర మధు, రాజిరెడ్డి, జగిత్యాల నాయకుడు కోడిపెల్లి గోపాల్‌రెడ్డి, మేడిపల్లి నాయకులు గుంజ శ్రీనివాస్, వినోద్‌రెడ్డి, నంద్యాడపు వెంకటేశ్ శుక్రవారం ఢిల్లీలో కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు.

**చందుర్తి(వేములవాడ):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను చందుర్తి మండల కేంద్రవాసి, రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్‌ను శుక్రవారం కలిశారు. శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# స్వాధీనం చేసుకున్న భూములు తిరిగివ్వాలి



మాట్లాడుతున్న గుంటి వేణు

**సిరిసిల్లటౌన్:** ఆక్వాహబ్ పేరుతో అప్పటి సర్కారు రైతుల నుంచి బలవంతంగా తీసుకున్న భూములు వెంటనే తిరిగివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో నిర్వహించిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచలో 150 మంది రైతుల నుంచి 364 ఎకరాల భూమిని సేకరించి ఆక్వాహబ్ పేరుతో నాలుగు కంపెనీలకు కట్టబెట్టారన్నారు. చీర్లవంచ గ్రామం మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్వాసిత గ్రామమైనా కనికరం లేకుండా రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కున్నారని ఆరోపించారు. సదరు భూములకు ఎకరానికి రూ.30లక్షలు ఉండగా.. ప్రభుత్వం కేవలం రూ.7లక్షలకు మాత్రమే కొనుగోలు చేసిందన్నారు. నాయకులు అజ్జ వేణు, సోమ నాగరాజు తదితరులున్నారు.

### 'ఈటల'ను కలిసిన నర్సయ్య



**తంగళ్లపల్లి(సిరిసిల్ల):** ముదిరాజ్ సంఘం ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు గౌడుగు నర్సయ్య శుక్రవారం బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఈటలను శాలువాతో సన్మానించారు. ఇల్లంతకుంటకు చెందిన పలువురు ముదిరాజ్ నాయకులున్నారు.

# ఓవర్ స్పీడ్‌తో ఇసుక ట్రాక్టర్లు

- పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి



**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఇసుక ట్రాక్టర్లు ఓవర్ స్పీడ్‌తో వెళ్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామ శివారులోని మానేరు వాగునుంచి ఇసుక లోడ్ చేసుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. రెవెన్యూ అధికారులు గడువు ప్రకారం ఇసుక తరలింపుకు అనుమతులు ఇస్తారు. అధికారులు అనుమతుల ప్రకారం రోజుకు నాలుగు నుంచి ఐదు ట్రిప్పులు తరలించే అవకాశం ఉండగా, ఇసుక వాహనదారులు ధనార్జనే ధ్యేయంగా ట్రిప్పుల సంఖ్య పెంచుకోవడానికి రోడ్డుపై వాహనాల స్పీడ్ పెంచుతున్నారు. దీంతో ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. మైనర్ బాలురే ఎక్కువగా ట్రాక్టర్లు నడుపుతున్నారు. ఆయా శాఖల అధికారులు తగు చర్యలు తీసుకొని ఇసుక ట్రాక్టర్ల వేగం తగ్గించి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ఎరువుల దుకాణాల తనిఖీ

**కోనరావుపేట:** మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి వెంకట్రామమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో లైసెన్సులను పరిశీలించారు. రికార్డులు, రోజూవారీ ఎరువుల పట్టికలను చూశారు.

### అదనపు బస్సులు నడపాలి

**వీర్నపల్లి:** మండల కేంద్రానికి సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి అదనపు బస్సులు నడపాలని సీపీఐ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం అంజయ్య తెలిపారు. శుక్రవారం వీర్నపల్లి మండల కేంద్రంలో మాట్లాడారు. బడులు ప్రారంభం కావడంతో బస్సులు సరైన సమయంలో లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

**ముస్తాబాద్:** సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సురేశ్ అన్నారు. ముస్తాబాద్ మేజర్ పంచాయతీ గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్ భిక్షపతి, ఎంపీటీసీలు మంజుల, షాదుల్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.